క్లుప్తంగా

గండి క్షేత్రంలో నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందిస్తున్న కొండన్న కుటుంబ సభ్యులు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానికి శనివారం ప్రొద్దుటూరుకు చెందిన మలిశెట్టి కొండన్న తన భార్య రామసుబ్బమ్మ జ్ఞాపకార్థం రూ.50,116లు విరాళం ఇచ్చారు. ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, ధర్మకర్తల మండలి సభ్యులు దాత కొండన్న కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటసుబ్బయ్య, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ బాలబాలికలకు చికిత్స

చింతకొమ్మదిన్నె : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు శివకేశవ, స్వచ్ఛంద న్యాయ సేవకులు సురేష్ శ్యాం మండలంలో అంగవైకల్యంతో బాధపడుతున్న బాలబాలికలకు వివరాలను సేకరించి కడప రిమ్స్ ఆవరణలోని ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌కు రెఫర్ చేశారు. బాల బాలికలు ఏదైనా శారీరక లేదా మానసిక అంగవైకల్యంతో బాధపడుతున్నట్లైతే వారికి చికిత్స అందించడంకోసం ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ నందు చిన్నపిల్లల వైద్యులు, స్పీచ్ థెరపిస్ట్, ఫిజియో థెరపిస్ట్, ఆడియోలజిస్ట్, కౌన్సిలర్ అందుబాటులో ఉంటారన్నారు. ఇందుకోసం ప్రజలు 15100 ఫోన్ నెంబర్ వుపయోగించి తమసంస్థ సేవలు పొందవచ్చని తెలిపారు.

నవీన్ సాయికుమార్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం



నవీన్ సాయికుమార్‌రెడ్డితో తల్లిదండ్రులు

పులివెందుల : మండలంలోని నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, పులివెందుల విద్యుత్ శాఖ ఎలక్ట్రికల్ లైన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి కుమారుడు నవీన్ సాయికుమార్‌రెడ్డికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. నంద్యాల శాంతిరాం మెడికల్ కళాశాలలో 2019 నుంచి 2025 ఎంబీబీఎస్ బ్యాచ్‌కు చెందిన నవీన్ సాయికుమార్‌రెడ్డి చదువు పూర్తి చేసి డాక్టరేట్ సర్టిఫికెట్‌ను పొందారు. తమ కుమారుడు డాక్టరేట్ పట్టా పొందడంపట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

5988 మంది రైతులకు పీఎం కిసాన్ లబ్ధి

ముద్దనూరు : మండలంలో ప్రధానమంత్రి కిసాన్ నిధుల ద్వారా 5988 మంది రైతులకు లబ్ధి చేకూరనుందని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈనెల 24వ తేదీన ఈ నిధులను ప్రధానమంత్రి విడుదల చేయనున్నారని, ఈకేవైసీ పెండింగ్‌లో వున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన సూచించారు.

పీ 4 సర్వేను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి మార్చి 2వ తేదీ వరకు ఈ సర్వే జరుగుతుందన్నారు. సచివాలయ సిబ్బంది మీ ఇంటి వద్దకు వచ్చినపుడు ప్రతి ఒక్కరూ మీ సమాచారాన్ని సచివాలయ సిబ్బందికి తెలియజేసి పీ4 సర్వేను తప్పని సరిగా చేయించుకోవాలని ఆయన కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



పాయసంపల్లె క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

వీరపునాయునిపల్లె : మండలంలోని గ్రామాల ప్రధాన కూడళ్లలో 48 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిభ బయోటెక్ కంపెనీ వారి ఆర్థిక సహకారంతో ఈ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. వేసవి కాలం కావడంతో ఎక్కువగా దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు తమ ఇళ్లలో, పరిసరాలు రికార్డింగ్ అయ్యే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఎర్రగుంట్ల : పట్టణంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయ 37వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, పంచామృత అభిషేకం, కుంకుమార్చన పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు.

మూగజీవాల సేవాతత్పరుడు

- దివ్యాంగులకు ఆపన్న హస్తం
- నిత్యం సేవకే పరిమితమైన దివ్యాంగుడు జనార్థన్‌రెడ్డి

పులివెందుల టౌన్ : సమాజ సేవలో ఎంతో మంది తమదైన శైలిలో ఎన్నో సేవలు అందిస్తున్నారు. అందులో వికలాంగుడైన జనార్థన్‌రెడ్డి దివ్యాంగుడైనప్పటికి అదేమి అడ్డుకాదని కాళ్లు సరిగా పనిచేయక పోయినా సంరక్షకులను వెంటబెట్టుకుని దాతల సహకారంతో ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

2021లో వికలాంగుల మానసిక దీనబంధు ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి అనాథలకు, వృద్ధులకు, వికలాంగులకు, పేద విద్యార్థులకు, మూగజీవాలకు సేవచేయడం మొదలు పెట్టాడు. జనార్థన్‌రెడ్డి సేవలను గుర్తించి నంద్యాల ఎంపీ ఎస్పీవై రెడ్డి కారు(ఓమిని)ను ఉచితంగా బహుకరించారు. ఆ వాహనంలో ఎక్కడ ఏ సేవా కార్యక్రమం చేయాలన్నా సంరక్షకులను వెంటబెట్టుకుని సేవ చేసేవాడు. జనార్థన్‌రెడ్డి చేస్తున్న సేవలను గుర్తించి ఎంతోమంది దాతలు ముందుకు వచ్చి సహకారం అందిస్తున్నారు. దివంగత డాక్టర్ ఇసీ గంగిరెడ్డి, దివంగత వైఎస్ వివేకానందరెడ్డి ప్రముఖుల వద్ద ఎన్నో ప్రశంసలు అందుకున్నారు.



ఆకలి తీర్చుకుంటున్న వానరాలు



తనకు తోచిన విధంగా సాయం చేస్తున్న దీనబంధు ఆశ్రమ సహాయకులు

మూగజీవాల ఆకలి తీరుస్తూ..

ఆకలితో అలమటిస్తున్న మూగజీవాల ఆకలి తీర్చేందుకు ఎంత దూరమైన వెళుతూ వాటికి పండ్లు అందిస్తూ జనార్థన్‌రెడ్డి వాటికి దీన బంధువయ్యాడు. పులివెందుల చుట్టూ ఉన్న కొండ ప్రాంతాలకు వెళ్లి ఎక్కడ వానరాలు ఉన్నాయో వాటిని గుర్తించి వాటికి అరటిపండ్లు, తినుబండారాలు తీసుకెళ్లి వాటి ఆకలి తీరుస్తున్నాడు. జనార్థన్‌రెడ్డి వాహనం వచ్చిందంటే వానరాలన్ని అక్కడికి చేరి పండ్లు ఆరగించి ఆకలి తీర్చుకుంటాయి. మూగ జీవాల దప్పికను తీర్చేందుకు నీటి తొట్లను కూడా ఏర్పాటు చేశారు. ఎక్కడ ఆవులు కనిపించినా వాటికి పండ్లు అందిస్తూ ఉంటాడు.

ప్రతి ఒక్కరు సమాజం కోసం సేవచేయాలి

ప్రతి ఒక్కరు ఎంతో కొంత సమాజసేవ కోసం పరితపించాలి. సేవలోనే భగవంతుడున్నాడు. ఆకలితో ఉన్న వారికి ఆకలి తీర్చాలి. నోరులేని ఎన్నో జీవరాసులు ఆకలితో అలమటిస్తున్నాయని.. వాటికి మన వంతు సాయం చేయడం కనీస బాధ్యత. మనం పోయాక మనతో ఏమి రావు. అందుకోసం ఎందూకీ ప్రాకులాట. సేవ చేయడంలో ఉన్న ఆనందం మరెందులోను రాదు.

– జనార్థన్‌రెడ్డి, దీనబంధు ఆశ్రమ నిర్వాహకుడు, పులివెందుల



29 మందికి ప్లేస్‌మెంట్

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్వ్యూలో జిల్లాలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 29 మందికి ప్లేస్‌మెంట్ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో దేశంలో ప్రముఖ థర్మల్ ప్రొడక్ట్స్ తయారు చేసే కంపెనీ అయిన సుబ్రోస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, బద్వేల్, కమలాపురంతో పాటు కడప మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన దాదాపు 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. 29 మందికి ప్లేస్‌మెంట్ లభించిందన్నారు. తమ కళాశాలలో ప్రతి నెల క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు.

రికార్డులు పరిశీలించిన డీఎస్పీ

ముద్దనూరు : స్థానిక అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి కేసును ఆన్‌లైన్ చేయాలని, పెండింగ్ కేసులు లేకుండా చూడాలని సూచించారు.

నీటి ఎద్దడిని నివారించే బాధ్యత మీదే

కమలాపురం : నీటి ఎద్దడి నెలకొంటే దానిని నివారించే బాధ్యత మీదేనని జడ్పీ సీఈఓ ఓబుళమ్మ తెలిపారు. శనివారం పాపాఘ్ని నది వద్ద ఉన్న సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని ఆమె అధికారులతో కలసి పరిశీలించి తదితర వివరాలపై ఆరా తీశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనువాసులరెడ్డి మాట్లాడుతూ ఈ స్కీం ద్వారా 24 గ్రామాలకు నీరు అందిస్తున్నామన్నారు. అయితే పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా జీవంపేట, సముద్రంపల్లె, సి.రాజుపాళెం, జి.అప్పాయపల్లె గ్రామాలకు నీరు సరఫరా కావడం లేదన్నారు. అలాగే రెండు ఫిల్టర్లు, వాల్స్ మంజూరు చేయాలని కోరడంతో ఆమె సానుకూలంగా స్పందించారు. ఎంపీడీఓ జ్యోతి, నగర కమిషనర్ పగడాల జగన్నాథ్, కాంట్రాక్టర్ ఎల్లారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్షిత మంచి నీటి పథకాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ ఓబుళమ్మ

బిందుసేద్యం విస్తరించాలి

ముద్దనూరు : ఉద్యాన పంటలకే కాకుండా మొక్కజొన్న, సజ్జ, పత్తి తదితర పంటలలో కూడా బిందుసేద్యాన్ని విస్తరించాలని ఏపీ ఎంఐపీ ప్రాజెక్టె డైరక్టర్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన ముద్దనూరులో ఉద్యాన, వ్యవసాయ సహాయకులకు బిందుసేద్యం, తుంపర పరికరాల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. 5 ఎకరాలలోపు పొలం వున్న చిన్న, సన్న కారు రైతులకు 90 శాతం రాయితీ, 5 ఎకరాల పైబడి పొలం కలిగిన రైతులకు 70 శాతం రాయితీతో బిందుసేద్యం పరికరాలు అందిస్తామన్నారు. అనంతరం ఆయన క్షేత్రస్థాయిలో రైతులు, సిబ్బందితో కలిసి బిందు సేద్యం పరికరాల ఏర్పాటును పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి మల్లేశ్వరరెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారి ఏసునాథరెడ్డి, ఇంజనీర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

వేంపల్లె : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య తెలిపారు. శనివారం ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరైన సీఐ, కడప ఫ్యాక్షన్ జోన్ ఎస్ఐ లక్ష్మిలు మాట్లాడుతూ మత్తు పదార్థాలు ఉపయోగించడం చట్టరీత్యా నేరమని, వీటికి అలవాటుపడి తమ భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. అలాగే దీనివల్ల శరీరంలో కలిగే దుష్ప్రభావం, మానసిక రుగ్మతలు, చట్టపరమైన చర్యల గురించి వివరించారు. పోలీసు కళా జాగృతి బృందం హెడ్‌కానిస్టేబుల్ నరసరావు ఆధ్వర్యంలో నృత్య, నాటక, పాటల రూపంలో అవగాహన కల్పించారు. ట్రిపుల్‌ఐటీ పరిపాలన అధికారి రవికుమార్, అకాడమిక్ డీన్ రమేష్, స్టూడెంట్ వెల్ఫేర్ వెంకటేష్, ఎన్ఎస్ఎస్ విభాగ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడకు ఘన నివాళి

పులివెందుల టౌన్ : తొలి స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి మహోన్నత వ్యక్తి అని కళాశాల అసోసియేట్ డీన్ ఎం.మాధవ తెలిపారు. శనివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఫుడ్‌అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్టూడెంట్ ఆక్టివిటీ అధికారి డాక్టర్ నివేదిత ఉయ్యాలవాడ జీవిత చరిత్ర గురించి వివరించారు. అలాగే పట్టణంలోని స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆర్‌సీడీఎస్ సంస్థ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి బ్రిటీష్ వారిని ఎదురించిన మొదటి స్వాతంత్ర్య సమరయోధుడు మన తెలుగు బిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా పట్టణంలోని పాతబస్టాండ్‌లోని ఆయన విగ్రహానికి నివాళులు అర్పించి మాట్లాడారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేయాలని డిమాండ్ చేశారు.



పులివెందులలో నరసింహారెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న డీన్, అధ్యాపకులు

కలమల్ల ఆలయ భూములపై విచారణ

ఎర్రగుంట్ల : మండలంలోని కలమల్ల గ్రామంలో ఉన్న శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన భూములపై శనివారం ఆర్డీఓ సాయిశ్రీ విచారణ చేపట్టారు. ఈ మేరకు పాతకలమల్ల, కొత్తకలమల్లలలో ఉన్న రెండు దేవాలయాల కమిటీ నిర్వాహకులతో ఆమె మాట్లాడి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదు మేరకు కలమల్ల గ్రామంలో ఉన్న రెండు దేవాలయలకు సంబంధించి రెవెన్యూ, దేవదాయ శాఖ రికార్డులను పరిశీలించి తదుపరి విచారణ చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏడీ మల్లిఖార్జున, తహసీల్దార్ శోభనబాబు, డివిజనల్ సర్వేయర్ వెంకటేశ్వరులు, మండల సర్వేయర్, ఆర్ఐ అర్జున్ వీఆర్ఓలు పాల్గొన్నారు.



కలమల్లలోని ఆలయంను పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

వెలవెలబోతున్న చంద్రన్న మహిళా మార్ట్

పులివెందుల రూరల్ : పొదుపు సంఘాల్లోని డ్వాక్రా మహిళలకు బయట మార్కెట్ కంటే తక్కువ ధరలకే నిత్యావసర వస్తువులు అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న మహిళా మార్ట్‌ను చంద్రన్న మహిళా మార్ట్‌గా మార్చారు. అప్పటినుంచి చంద్రన్న మహిళా మార్ట్‌లో నిత్యావసర వస్తువులు లేక వెలవెలబోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుంచి చంద్రన్న మహిళా మార్ట్‌గా పేరు మార్చారే కానీ నిత్యావసర వస్తువులు దొరకడం లేదని డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి చంద్రన్న మహిళా మార్ట్‌లో తక్కువ ధరలకే నిత్యావసర వస్తువులు లభించే విధంగా చూడాలని పలువురు మహిళలు కోరుతున్నారు.



చంద్రన్న మహిళా మార్ట్‌లో కనిపించని నిత్యావసర సరుకులు

చెప్పిన పథకాలు అమలు చేయండి

ఎర్రగుంట్ల : కూటమి నేతలు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డిపై విమర్శలు చేయడం మానుకుని ఎన్నికల్లో చెప్పిన హామీలను అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మేకల వీరభాస్కర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి నాయకులు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జమ్మలమడుగును అభివృద్ధి చేయలేదనడం హాస్యాస్పందమన్నారు. సుధీర్‌రెడ్డి హయాంలో మాలెపాడు అన్ని విధాలుగా అబివృద్ధి జరిగిందన్నారు. ఎర్రగుంట్ల మండలంను చాలా అభివృద్ధి చేశారన్నారు. కొండాపురం, ముద్దనూరు మండలాల్లో అభివృద్ధిని ఒక్కసారి చూడాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు జయరామకృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : మార్చి 8వ తేదిన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. శనివారం సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో, న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై ఆమె సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. చిన్న చిన్న కేసులతో సంవత్సరాల తరబడి స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగకుండా కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అయ్యే విధంగా చూడాలని అధికారులకు సూచించారు.

రేపటి నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు

పులివెందుల టౌన్ : పట్టణంలో ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. ఈనెల 24, 25వ తేదీలలో నగరిగుట్ట, రమణప్ప సత్రం ఉన్నత పాఠశాలల్లోనూ, 27, 28వ తేదీలలో నివేదిత విద్యాశాల, కడప రోడ్డులో ఉన్న ఎంజేపీఏబీసీడబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాలలో ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మొక్కలను సంరక్షించాలి

పులివెందుల రూరల్ : మొక్కల సంరక్షణతో భావి భారత మనుగడకు ప్రముఖ పాత్ర వహిస్తాయని జెఎన్‌టీయూ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. శనివారం తుమ్మలపల్లె సమీపంలోని గంగమ్మచింతల ఆలయ ఆవరణలో ఆయన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతను విద్యార్థులతో చేపట్టారు. మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారిణి శేష మహేశ్వరమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి) లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్న ట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపు ణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బుల కు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

వల్లూరు (చెన్నూరు) : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేసే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.మేరీ పిలుపునిచ్చారు. చెన్నూరులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని అలాగే ప్రతి పిల్లవాడికి రూ.30 పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వంట ఏజెన్సీ కార్మికులందరూ పాల్గొనాలని ఆమె కోరారు.

రైతులకు అందుబాటులో గోడౌన్

చింతకొమ్మదిన్నె : బుగ్గలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌను నిర్మించామని రైతులు తమ పంట దిగుబడులను నిలువ చేసుకోవాలని నాగిరెడ్డిపల్లి పీఏసీఎస్ సీఈవో రవిశంకరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గోడౌను ఉపయోగించుకోని పక్షంలో ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు ఈ గోడౌన్‌ను బాడుగకు ఇస్తుందన్నారు. రైతులకు మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు.

ఉత్తీర్ణతే ధ్యేయంగా చదవాలి

పులివెందుల రూరల్ : ఉత్తీర్ణతే ధ్యేయంగా పదవ తరగతి విద్యార్థులు చదవాలని ఎంఈఓ శారద తెలిపారు. సింహాద్రిపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పులివెందుల జెఎన్‌టీయూ హెల్పింగ్ హ్యాండ్స్ విద్యార్థులు మోటివేషన్ క్లాసెస్, మెమరీ టెక్నిక్స్‌పై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాత్కాలిక కోర్టు కార్యాలయం ప్రారంభం

కమలాపురం : స్థానిక ఎస్‌టీఓ కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక జూనియర్ సివిల్ కోర్టు కార్యాలయాన్ని జిల్లా కేంద్రంలోని మూడవ అదనపు జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ జి.విజయలక్ష్మీ ప్రారంభించారు. కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు భవనం బ్రిటీష్ కాలం నాటి కట్టడం కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కోర్టు అధికారులు నూతన భవనం నిర్మించాలని విన్నవించారు. ప్రభుత్వం నూతన భవనం నిర్మించేందుకు రూ.8 కోట్లు మంజూరైంది. దీంతో పాత భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించాలని గతంలో జిల్లా మెజిస్ట్రేట్ పలుమార్లు సందర్శించారు. అప్పటి వరకు ఎస్‌టీఓ కార్యాలయంలో విధులు నిర్వర్తించేలా గదులు సిద్ధం చేసుకోవాలని జిల్లా జడ్జి ఆదేశించారు. ఈ మేరకు శనివారం తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుష్పరాజు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



తాత్కాలిక కోర్టు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జడ్జి విజయలక్ష్మీ

తాగునీటి సమస్యలేకుండా చర్యలు తీసుకోండి

వేముల : వేసవి సమీపిస్తున్న దృష్ట్యా మండల వ్యాప్తంగా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వస భ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. అలాగే వైద్య, ఆరోగ్యంపై వైద్యులు అధ్రిన్‌ను సమావేశంలో వివరించారు. అన్ని రైతు సేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ చెన్నారెడ్డి వివరించారు. గతంలో పాడా నిధులతో రైతులకు సబ్సిడీపై డీడీలు అందజేశారని, ఇంతవరకు పైపులు ఇవ్వలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి జెడ్పీటీసీ స్పందిస్తూ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, వాటికి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ మల్లికార్జున రెడ్డి, తహసీల్దార్ ఇందిరారాణి, మండల ఉపాధ్యక్షుడు నర సింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ

తాగునీటిపై ప్రణాళికలు సిద్ధం చేయండి

మైలవరం : మండలంలోని ఆయా గ్రామాల్లో వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్యలేకుండా చేయాలని ఎంపీపీ సావిత్రమ్మ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి హామీపనులు, వ్యవసాయ పనులు, హౌసింగ్ నిర్మాణం, వైద్య, విద్యా తదితర అంశాలపైన అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించండి

పెండ్లిమర్రి : వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా నీటి ఎద్దడిపై దృష్టి సారించాలని ఎంపీపీ ఎం.వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ముందస్తుగా తాగునీటి సమస్యలు ఏర్పడే గ్రామాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, డీటీ నరసింహులు, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు

చింతకొమ్మదిన్నె : బుగ్గలపల్లె సమీపంలోని బుగ్గమల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయం కమిటీ సభ్యులు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గుడా ప్రభాకరరెడ్డి తెలిపారు. బుధవారం భక్తులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే రోజు బండలాగుడు పోటీలు నిర్వహిస్తారన్నారు. మొదటి బహుమతిగా రూ.40వేలు కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజనేయరెడ్డి అందిస్తారన్నారు. రెండో బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతిగా రూ.20 వేలు, నాలుగో బహుమతిగా రూ.15వేలు, ఐదవ బహుమతిగా రూ.10 వేలు అందిస్తామని తెలిపారు.

